సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 11 । జూన్ । 2024



విద్యుత్ వాహనాలపైనే మొగ్గు

వాహన యజమానులు ఎలక్ట్రికల్ బైక్‌ల వైపు అడుగులు వేస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి వర్గాలు ఈ-వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. 8లో



డిజిటల్ బోధనతో సత్ఫలితాలు

సెంట్రల్ సిలబస్‌లో మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయుడు అవగాహన పెంచుకుని బోధన చేయాలని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. 8లో



ధాన్యం సొమ్ములు చెల్లించాలి

ధాన్యం బకాయి సొమ్ములను ప్రభుత్వం తక్షణం ఇవ్వాలంటూ భీమవరం సివిల్ సప్లయ్స్ కార్యాలయం వద్ద కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 8లో

ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధం

- సీజన్‌కు 58,905 మెట్రిక్ టన్నులు అవసరం
- ఇప్పటికే సిద్ధంగా 45,324 మెట్రిక్ టన్నులు
- ఆర్‌బీకే, మార్క్‌ఫెడ్, సొసైటీలు, డీలర్ల ద్వారా పంపిణీ



సాక్షి, భీమవరం: జిల్లాలో తొలకరి పనులు జోరందుకుంటున్నాయి. సకాలంలో కాలువలకు నీరు విడుదల కావడం, రుతుపవనాల రాకతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. చాలా ప్రాంతాల్లో నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. మరోపక్క సీజన్‌కు అవసరమైన ఎరువులను వ్యవసాయశాఖ ముందుగానే సిద్ధం చేసింది. సీజన్‌కు 58,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఆర్‌బీకే, మార్క్‌ఫెడ్, సొసైటీలు, డీలర్ల ద్వారా 45,324 మెట్రిక్ టన్నులను రైతులకు అందుబాటులోకి ఉంచింది. ఎరువులకు ఎలాంటి కొరత రాకుండా ముందునుంచే చర్యలు చేపట్టింది.

జిల్లాలోని పశ్చిమ డెల్టా, మెట్ట ఏరియాలోని 2.32 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు జరగనుంది. నవంబరు చివరిలో వచ్చే తుఫానుల బెడద నుంచి పంటను కాపాడుకునే నిమిత్తం ముందస్తు సాగుకు వ్యవసాయశాఖ రైతులను సన్నద్ధం చేస్తోంది. జూన్ ఆరంభంలోనే గోదావరి డెల్టా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. జూలై రెండవ వారం నాటికి నాట్లు పూర్తి చేయడం ద్వారా నవంబరు మొదటి రెండు వారాల నాటికి కోతలు పూర్తవుతాయి. దీని వల్ల నవంబరు చివరిలో వచ్చే తుఫానుల ముప్పు నుంచి తొలకరి పంటను కాపాడుకునే వీలుంటుంది. ముందుగా రబీ మాసూళ్లు పూర్తయిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాల్లో నారుమడుల తయారీ ముమ్మరంగా సాగు చేస్తుండగా వీరవాసరం, ఆచంట, పోడూరు, పాలకొల్లు, తణుకు రూరల్ మండలాల్లోను రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మరో వారం పది రోజుల్లో పనులు వేగవంతం చేసి ఈనెల 25 నాటికి నారుమడుల పనులు పూర్తిచేసుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పుష్కలంగా ఎరువులు

సాధారణంగా తొలకరిలో ఎకరాకు ఒక బస్తా పొటాష్, ఒక బస్తా డీఏపీ, అరబస్తా కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తుంటారు. సాగు ఆరంభం నుంచి చిరు పొట్ట దశ వరకు పలు దఫాలుగా యూరియా వినియోగం ఉంటుంది. నాట్లు వేసిన రెండు వారాల తర్వాత డీఏపీ, ఐదు వారాల తర్వాత కాంప్లెక్స్ ఎరువులు వేస్తుంటారు. ఈ మేరకు ఖరీఫ్ సీజన్‌లో 21,272 మెట్రిక్ టన్నుల యూరియా, 23,464 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 2,391 మెట్రిక్ టన్నుల డీఏపీ, 6,391 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 5,387 మెట్రిక్ టన్నుల ఎంఓపీలతో మొత్తం 58,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి. రైతులకు ఇబ్బంది లేకుండా సాగుకు అవసరమైన ఎరువులను వ్యవసాయశాఖ ముందుగానే సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే మార్క్‌ఫెడ్ వద్ద 3,008 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్స్ వద్ద 29,293 మెట్రిక్ టన్నులు, రిటైలర్స్ వద్ద 11,446 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 45,324 మెట్రిక్ టన్నులు, ఆర్‌బీకేల వద్ద 1,488 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సాగు కాలంలో ఎరువుల కొరత తలెత్తకుండా ఆయా నెలల అవసరాలకు అనుగుణంగా ముందుగానే ఎరువులను సిద్ధం చేసినట్టు తెలిపారు.

మరోపక్క తొలకరికి 48,463 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా కొరత లేకుండా ఎంటీయూ 1318, 7029, 1061, 1064 రకాలతో పాటు స్పందన స్వర్ణ, పీఆర్ 126 వరి వంగడాలు అందుబాటులో ఉంచారు. 100 క్వింటాళ్ల వరకు విత్తనాలను కేజీకి ఐదు రూపాయల సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధం చేశారు. ఇప్పటికే ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రం రైతులు సొంతంగా సేకరించుకున్న విత్తనాలను వాడుతున్నారు.

విషాదాంతమైన దైవదర్శనం

కట్టూరు గోదావరి రేవులో మునిగి తల్లీకొడుకు మృతి



అల్లంశెట్టి నాగమణి



తేజ శ్రీనివాస్

వేలేరుపాడు: మండలంలోని కట్టూరు గోదావరి రేవులో సోమవారం ఉదయం పుణ్యస్నానం ఆచరించడానికి దిగిన ఆ కుటుంబాల్లో విషాదం అలముకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట మండల కేంద్రంలో చిన్నంశెట్టి బజారుకు చెందిన అల్లం శెట్టి నాగమణి(45), తేజ శ్రీనివాస్(23) మరో 14 మందితో కలిసి వేలేరుపాడు మండలంలోని కట్టూరు శివాలయానికి సోమవారం ఉదయం రెండు ఆటోల్లో బయలుదేరారు. వీరంతా కట్టూరు శివాలయం ప్రాంతంలోని గోదావరి రేవుకు చేరుకున్నారు. అక్కడ గోదావరి ఒడ్డున స్నానాలు చేశారు. వీరిలో తేజ శ్రీనివాస్(23) గోదావరి లోతుల్లో దిగాడు. ఈతరాకపోవడంతో ప్రమాదవశాత్తు కొట్టుకుపోతుండటంతో తల్లి నాగమణి కొడుకును కాపాడేందుకు నదిలోకి దిగింది. లోతు ఉండటంతో తల్లి కూడా మునిగిపోయింది. సోమవారం మధ్యాహ్నం నుంచి జాలర్లు బోట్‌ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలు వెలికితీశారు.

న్యూస్‌రీల్

పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట సుబ్బారావు



నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఫెడరేషన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

తణుకు: ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉండ్రాజవరం మండలం కాల్దరి గ్రామానికి చెందిన కోమట్లపల్లి వెంకటసుబ్బారావు (దుర్గా ప్రతిమ పౌల్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్) నియమితులయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన 13 జిల్లాల పౌల్ట్రీ రైతుల సదస్సులో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్లు వెంకట సుబ్బారావు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా టి.కుటుంబరావు, టీజీ భాస్కర్, సంయుక్త కార్యదర్శిగా పడాల సుబ్బారెడ్డి, కోశాధికారిగా కె.సోమిరెడ్డి, కార్యదర్శిగా ఎంఆర్‌కే రెడ్డి, జాయింట్ కార్యదర్శిగా కె.రవిశేఖర్‌రెడ్డి, సభ్యులుగా ఎం.రమేష్ బాబు, బి.శ్రీరామారావు, వి.హేమాద్రిలను నియమించినట్లు వెల్లడించారు.

12 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ పాసులు

తణుకు అర్బన్: 2024–25 నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థుల కోసం తణుకు ఆర్టీసీ డిపో నుంచి బస్ పాసులు ఈ నెల 12 నుంచి మంజూరు చేస్తున్నట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. 20 కిలోమీటర్ల పరిధిలో 7వ తరగతి వరకు బాలురు, 10వ తరగతి వరకు బాలికలకు ఐడీ కార్డు కోసం రూ.50 రుసుంతో ఏడాది పొడవునా ఉచిత ప్రయాణానికి బస్ పాసులు, 50 కిలోమీటర్ల పరిధిలో సబ్సిడీ బస్ పాసులు పొందవచ్చని చెప్పారు. తణుకు ఆర్టీసీ కౌంటర్‌లో విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్ అందచేసి పాసులు పొందవచ్చని తెలిపారు.

ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 56 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న ఇంటర్ కోర్సుల సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు భౌతిక శాస్త్ర ప్రయోగ పరీక్షకు 46 మంది విద్యార్థులకు 33 మంది హాజరుకాగా 13 మంది గైర్హాజరయ్యారు. రసాయన శాస్త్ర పరీక్షకు 40 మందికి 23 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



బొట్ల రామారావు(ఫైల్)

పెదవేగి: తల్లి మందలించిందని యువకుడు మనస్తాపానికి గురై క్షణికావేశంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెదవేగిలో చోటుచేసుకుంది. పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి గ్రామానికి చెందిన బొట్ల రామారావు(20) న్యాయంపల్లిలోని ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 9న రాత్రి సమయంలో మద్యం తాగి ఇంటికి వెళ్లగా, దీంతో తల్లి వెంకటేశ్వరమ్మ కొడుకును మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రామారావు రాత్రి సమయంలోనే సెల్ ఫోన్ ఇంటిలో వదిలేసి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని పామాయిల్ ఫ్యాక్టరీ సమీపంలో మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని శవపరీక్షకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వేధింపులపై శాఖాపరమైన విచారణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేధింపులు భరించలేక గత నెల 22న ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్ జీ.కృష్ణ కిషోర్ ఘటనపై విచారణ నివేదికను ఎస్ఈకి అందజేశారు. ఈ సంఘటనపై తుది విచారణ చేయాలని సంస్థ సీఎండీ విశాఖపట్నంలోని సంస్థ జీఎం హెచ్ఆర్‌డీని ఆదేశించారు. ఈ మేరకు జీఎం రాజు సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విచారణ చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించి సాక్షులైన విద్యుత్ టెక్నికల్ ఈఈ ఎం.రూన్సీ, పీఓ ఎం.లక్ష్మి, బాధితుడు జీ.కృష్ణకిషోర్, సీనియర్ అసిస్టెంట్లు ఎండీ ఆసిఫ్, బషీరున్నీసా తదితరులను విచారించారు. జీఎం విచారణలోనూ పలువురు సాక్షులు జూనియర్ అకౌంట్స్ అధికారి కృష్ణవేణి వేధింపులపై ఫిర్యాదు చేశారని సమాచారం.

నీటి కాలుష్యాన్ని అరికట్టాలి



కాలుష్యాన్ని నియంత్రించాలంటూ భీమవరంలో ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

భీమవరం : జిల్లాలో కాలుష్యాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, కాలుష్య నియంత్రణ మండలితో సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లోని యనమదుర్రు డ్రెయిన్ వంతెనపై కాలుష్యాన్ని అరికట్టాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అనేక పరిశ్రమల కాలుష్యం పంట, తాగునీటి కాలువలు, డ్రెయిన్లలోకి వదిలేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నీటిని మంచి నీరు చెరువులకు, పంటలకు వాడుతున్నామని కలుషిత నీరు తాగడం వల్ల వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరం పట్టణ నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్ ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో జీవనదిలా కళకళలాడుతూ అనేక గ్రామాల ప్రజలకు సాగు, తాగు, ఇతర అవసరాలకు ఉపయోగపడేదని, వేలాది మత్స్యకార కుటుంబాలు చేపల వేట ద్వారా జీవనం పొందేవారని, ప్రస్తుతం పూర్తిగా పరిశ్రమల కాలుష్యంతో మురికి కూపంగా మారిపోయిందన్నారు. వెంకయ్యవయ్యేరు, కాజ డ్రెయిన్, బొండాడ డ్రెయిన్ వంటివన్నీ కలుషితమయ్యాయని వాపోయారు. తక్షణం కలెక్టరు, కాలుష్యనియంత్రణ మండలి కాలుష్యాన్ని అరికట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.వైకుంఠరావు, మల్లిపూడి ఆంజనేయులు, కె.సత్యనారాయణ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నక్కల డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలి



భీమవరంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

భీమవరం : నక్కల కాలువను తక్షణం ఆధునికీకరించాలని, వడ్డిలంక వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగించి ముంపు నీరు బయటకు తోడేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో భీమవరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ పెనుగొండ, ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాలను ఆనుకొని ఉన్న నక్కల డ్రెయిన్ నీటితో అనేక గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి, కూరగాయలు, ఆక్వా పంటలు సాగుచేస్తున్నారని, ఏటా అధిక వర్షాలు, వరదల సమయంలో పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డిలంకలో గోదావరి వద్ద ఏర్పాటు చేసిన స్లూయిజ్‌ను సక్రమంగా నిర్వహించక పోవడమే దీనికి కారణమన్నారు. గోదావరిలో వరద నీరు గ్రామాలకు వెళ్లడంతో కాంబొట్లపాలెం, చినదిబ్బ, గుంపర్రు, వద్దిపర్రు, గుమ్ములూరు, రావిపాడు, పెనుమర్రు, కట్టుకాలువ, నార్నిమెరక, చిరగాలపల్లి, ఆచంటవేమవరం, ఆచంట, శేషమ్మ చెరువు, దేవ, సోమరాజు చెరువు తదితర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. నక్కల కాలువను, వడ్డిలంక వద్ద స్లూయికజ్ తలుపులను వెంటనే ఆధునికీకరించాలని, స్లూయిజ్ వద్ద నిరుపయోగంగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ఇంజిన్లు ఉపయోగించి రైతులకు నష్టం లేకుండా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నడింపల్లి రామభద్రరాజు, దొమ్మేటి జనార్దన్, గన్నమనేని వీరభద్రం, జడ్డు బదరీనారాయణ, దొంగ నాగేశ్వరరావు, కాండ్రేగుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో అంతర పంటలపై ఆసక్తి

రాయితీలు అందిస్తున్న ప్రభుత్వం



కొబ్బరిలో అంతరపంటగా కోకో

చింతలపూడి : వ్యవసాయ రంగంలోని మార్పులకు అనుగుణంగా జిల్లాలోని రైతులు నూతన వ్యవసాయ విధానాలు అవలంబిస్తున్నారు. అంతర పంటలు పండించడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అంతర పంటల సాగుతో ఒక పంటకు నష్టం జరిగినా మరో పంటతో నష్టాల నుంచి బయటపడొచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ఉద్యాన పంటల సాగులో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలో ఉద్యాన పంటలు పండించే రైతులకు అనేక రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయి.

ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహంతో కొబ్బరి, ఆయిల్‌పాం తోటల్లో అంతర పంటల సాగువైపు జిల్లా రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో సుమారు 1.50 లక్షల హెక్టార్లకు పైగా ఉద్యాన పంటలు విస్తరించి ఉండగా అత్యధిక భాగం 80 వేల హెక్టార్లలో పామాయిల్, 24 వేల హెక్టారుల్లో కొబ్బరి పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 22,000 హెక్టార్లలో అంతర పంటగా కోకోతో పాటు వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

మెట్టలో పెరిగిన అంతరపంటల సాగు

మెట్ట ప్రాంతంలో రైతులు అంతర పంటలపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. అంతర పంటల్లో భాగంగా కొబ్బరిలో కోకో, అరటి, ఆయిల్‌పాం తోటల్లో వేరుశనగ, మొక్కజొన్న, మామిడిలో మొక్కజొన్న సాగు, ఏకకాలంలో రెండు, మూడు రకాల కూరగాయల సాగును మెట్ట రైతులు అవలంభిస్తున్నారు. దీనివల్ల కూలీల కొరత అధిగమించడమే కాకుండా ఎరువులు, పురుగుమందులు వాడినప్పుడు ఖర్చు తగ్గుముఖం పట్టినట్లు రైతులు చెబుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే వీలు కలుగుతుందని చెబుతున్నారు.

కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కల్పించాలి



ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లు నిర్మించాలి. రైతులు పండించిన పంటలకు మంచి ధర వచ్చేలా కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరచుకుంటారు. ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తే మరింతమంది రైతులు అంతర పంటలు పండించడానికి ముందుకు వస్తారు. సరైన ప్రణాళిక, అవగాహనతో రెండు లేదా మూడు పంటలను ఒకే సారి రైతులు సాగు చేసుకునే అవకాశం అంతర పంటల సాగులో ఉంది.

– కలకొండ రామారావు, మండల పరిషత్ చీఫ్ విప్, ఉద్యాన రైతు



ఆయిల్ పాంలో మొక్కజొన్న పంట



మామిడిలో అంతర పంటగా వరి సేద్యం

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట, వరి విత్తనాలు



బుట్టాయగూడెంలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

బుట్టాయగూడెం: ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని రైతులకు పంపిణీ చేసేందుకు సుమారు 11 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె హబీబ్ బాషా తెలిపారు. బుట్టాయగూడెం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ ఏఈఓలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో ఏ రకాల పంటలు వేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతంలో పనిచేసే వ్యవసాయాధికారులు తప్పనిసరిగా పంటలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పంటలపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ మెరుగైన దిగుబడులు సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 2,500 క్వింటాళ్ల జనుము, 2,500 క్వింటాళ్ల పిల్లి పెసర, 6,000 క్వింటాళ్ల జీలుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో రైతులకు 90 శాతం సబ్సిడీపై ఇస్తామని చెప్పారు. జిల్లాలో లక్ష్యాన్ని మించి 22 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. సుమారు 60 నుంచి 70 వేల ఎకరాల వరకూ వరి విత్తనాలను సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామని చెప్పారు. పెసర, మినుము సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేసేలా తగు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. పురుగుమందు వాడకాన్ని కూడా పంట పొలాల్లో తగ్గించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. విత్తనాల ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమతిలేకుండా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పంచాయతీ సొమ్ము స్వాహాపై చర్యలేవీ?



మీడియాతో మాట్లాడుతున్న ఫిర్యాదిదారు అముక్త

ద్వారకాతిరుమల: స్థానిక పంచాయితీ నిధులు పక్కదారిపట్టినట్టు అధికారుల విచారణలో వెల్లడయినప్పటికీ సంబంధిత వ్యక్తులపై ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఫిర్యాదిదారు నిమ్మగడ్డ అముక్త ధ్వజమెత్తారు. ద్వారకాతిరుమల గ్రామ పంచాయితీలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం జరిగాయంటూ గ్రామానికి చెందిన అముక్త కొద్ది నెలల క్రితం స్పందనలో, పంచాయితీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాలతో దీనిపై డీఎల్‌పీఓ ఎండీ రజావుల్లా దాదాపు 3 నెలలపాటు పూర్తిస్థాయి విచారణ జరిపి, ఈ ఏడాది ఏప్రిల్ 26న సంబంధిత నివేదికను జిల్లా పంచాయితీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌కు సమర్పించారు. సోమవారం డీపీవో కార్యాలయం వద్ద అముక్తతో పాటు, ద్వారకాతిరుమలకు చెందిన చిలుకూరి ధర్మారావు మీడియాతో మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో రూ.1.20 కోట్ల మేర నిధులు పక్కదారి పట్టినట్టు విచారణలో బట్టబయలైనా, అధికారులు పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావుపై చర్యలు తీసుకోకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారో అర్థం కావడం లేదని అముక్త అన్నారు. 9 నెలలుగా తాను ఈ అక్రమాలపై పోరాటం చేస్తున్నానని చెప్పారు. ధర్మారావు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఒకరిద్దరు పంచాయతీ వార్డు సభ్యులు ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. స్వాహా జరిగిన సొమ్ము రూ.2 కోట్లకు పైమాటేనని ఆయన అన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు

పాలకొల్లు సెంట్రల్‌: పంచారామక్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని సోమవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు అనంతరం లక్ష్మీపార్వతి అమ్మవార్లు, జనార్ద నస్వామికి, గోపూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు పంచహారతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ బోల్తా.. తప్పిన ప్రమాదం


మోగల్లు వద్ద బోల్తా కొట్టిన ట్రాక్టర్‌

పాలకోడేరు: ముందు వెళుతున్న మోటార్‌సైకిల్‌ను అధిగమించే క్రమంలో ఓ ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. భీమవరం – తణుకు రహదారిలో భీమవరం నుంచి మోగల్లుకు లోడుతో వెళుతున్న ఓ ట్రాక్టర్‌ సోమవారం మధ్యాహ్నం మోగల్లు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న మోటార్‌సైకిల్‌ను క్రాస్‌ చేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు వెంటనే స్పందించి ట్రాక్టర్‌ నుంచి డ్రైవర్‌ను బయటకు లాగడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది.

వ్యక్తి మృతదేహం లభ్యం


వీరవల్లి దుర్గారావు (30)

పాలకొల్లు అర్బన్‌/యలమంచిలి: పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం గ్రామానికి చెందిన వీరవల్లి దుర్గారావు (30) మృతదేహం సోమవారం చించినాడ వద్ద గోదావరిలో లభ్యమైంది. దుర్గారావు కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం చించినాడ వశిష్ట బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. తండ్రి రామమూర్తి ఫిర్యాదు మేరకు యలమంచిలి ఎస్సై కె.శివన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌ వాహనాలపైనే మొగ్గు

- ఏటా పెరుగుతున్న ఎలక్ట్రిక్‌ వాహనాల విక్రయాలు
- ఇంధన ఖర్చు ఆదా, లైసెన్స్‌, రిజిస్ట్రేషన్‌ అవసరం లేదు
- 3 గంటల చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల వరకు ప్రయాణం
- రూ.60 వేల నుంచి వివిధ రకాల మోడళ్లలో లభ్యం
- చిన్న పట్టణాల్లో సైతం షోరూమ్‌ల ఏర్పాటుకు ఆసక్తి


భీమవరంలోని ఓ షోరూమ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్‌ బైక్‌లు

వీరవాసరం: పెట్రోల్‌ ధరలు సామాన్యుడిగా భారంగా మారిన నేపథ్యంలో వాహన యజమానులు ఎలక్ట్రికల్‌ బైక్‌ల వైపు అడుగులు వేస్తున్నారు. ఇంధనం, నిర్వహణ ఖర్చు ఆదా చేసుకునే అవకాశం ఉండడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలు ఈ–వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. పట్టణాలు, నగరాల్లో రోజువారీ కార్యకలాపాల కోసం 20 నుంచి 30 కిలో మీటర్ల ప్రయాణించే వారందరూ ఇప్పుడు ఈ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో చిన్న పట్టణాల్లో సైతం ఈ–వాహనాలు విక్రయించే షోరూమ్‌లు వెలుస్తున్నాయి. సుమారు పదికిపైగా కంపెనీలు ఈ–వాహనాలు తయారు చేస్తున్నాయి. రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు వివిధ రకాల మోడళ్లలో ఎలక్ట్రికల్‌ వాహనాలు లభ్యమవుతున్నాయి. రోజుకు మూడు నుంచి నాలుగు గంటల పాటు చార్జింగ్‌ పెడితే, సామర్థ్యాన్ని బట్టి 60 నుంచి 120 కిలోమీటర్ల వరకూ మైలేజీ వచ్చే వాహనాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. క్రమంగా గ్రామీణులు సైతం వీటిపై మక్కువ చూపుతున్నారు. ఇటీవల భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు వంటి పట్టణాల్లోనూ షోరూమ్‌లు వెలిశాయి. సాధారణంగా ఇంటి నుంచి ఆఫీసుకి వెళ్లి రావడం, పిల్లలను స్కూల్లో దింపి, సాయంత్రం తీసుకురావడానికి, పొలానికి వెళ్లి వచ్చేందుకు ఈ–వాహనాలు అనువుగా ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు.

రూ.10కే 60 నుంచి 120 కి.మీ ప్రయాణం

పెట్రోల్‌తో నడిచే వాహనం కొనాలంటే ఇప్పుడు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ ఖర్చవుతోంది. అయినా ఇవి లీటర్‌ పెట్రోల్‌కు 35 నుంచి 50 కిలోమీటర్లు మాత్రమే మైలేజ్‌ మాత్రమే ఇస్తున్నాయి. అంటే ఒక్కో కిలోమీటరుకు రూ.2.25 నుంచి రూ.2.50 వరకు ఖర్చవుతోంది. అదే ఈ–వాహనం అయితే యూనిట్‌ నుంచి యూనిటన్నర విద్యుత్‌ చార్జి, అంటే రూ.10కే 60 నుంచి 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. కేవలం కిలోమీటర్‌కు 15 నుంచి 20 పైసల లోపు ఖర్చవుతుంది. యూనిట్‌ కరెంట్‌ రేట్‌ రూ.6.50. ఈ లెక్కన ఎలక్ట్రికల్‌ బైక్‌ వినియోగిస్తే నెలకు రూ.300 లోపు కరెంటుకు ఖర్చవుతుంది. అదే పెట్రోలు కోసం రూ.3 వేల వరకు ఖర్చు చేయాలి. పైగా ఈ–వాహనానికి బ్యాటరీ, మోటార్‌ మాత్రమే ఉంటాయి. దీంతో తక్కువగా రిపేర్లు వస్తాయి. రోజుకు వంద కిలోమీటర్లు తిరిగే వారికైతే దాదాపు రూ.10 వేల వరకు ఇంధన వ్యయం ఆదా అవుతుంది. పైగా ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్‌ అవసరం కూడా ఉండదు.

పల్లెల్లోనూ పెరుగుతున్న వినియోగం

పట్టణాల్లో, పల్లెల్లోనూ క్రమంగా ఈ–వాహనాల వినియోగం పెరుగుతోంది. ఒక్కో షోరూమ్‌లో నెలకి సరాసరిన పది వాహనాలు అమ్ముడవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం భీమవరం, తాడేపల్లిగూడెం షోరూమ్‌ల ద్వారా గత ఏడాదిలో దాదాపు 300 వాహనాలను విక్రయించినట్లు చెబుతున్నారు.

ఖర్చు నామమాత్రం



పట్టణంలోని కార్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నా. గత ఆగస్టులో ఎలక్ట్రికల్‌ బైక్‌ కొనుగోలు చేశా. కరెంట్‌కు నెలకు రూ.300లకు మించి ఖర్చవడం లేదు. ఒకసారి చార్జింగ్‌ పెడితే 70 నుంచి 80 కిలోమీటర్ల వరకు మైలేజీ వస్తోంది. ఒక రోజు చార్జింగ్‌ పెడితే మూడు రోజుల పాటు వస్తోంది. పిల్లలను స్కూలుకు తీసుకువెళ్లి, తీసుకువస్తుంటా, ఇతర అవసరాలకు వాహనం వినియోగిస్తున్నాం. – గెద్దం బాబ్జి, చింతలకోటి గరువు

నెలకు రూ.3 వేలు ఆదా



గతంలో బైక్‌ పెట్రోల్‌కు నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చయ్యేది. ఏడాది క్రితం ఈ–వాహనం కొనుగోలు చేశాం. ఉదయాన్నే ఈ బైక్‌పై పిల్లలను స్కూల్‌లో దింపి, ఉద్యోగానికి వెళుతుంటా. సాయంత్రం స్కూల్‌ నుంచి పిల్లల్ని తీసుకువస్తున్నా. పట్టణంలో ఏదైనా అవసరం ఉంటే ఈ–వాహనాన్ని వాడుతున్నాం. కరెంట్‌ బిల్లు నెలకు రూ.200 మాత్రమే పెరిగింది. – డి.టైటస్‌, రాయకుదురు

ధాన్యం సొమ్ములు చెల్లించాలని ధర్నా


భీమవరంలో ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

భీమవరం: రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయి సొమ్ములను ప్రభుత్వం తక్షణం ఇవ్వాలంటూ సివిల్‌ సప్లయ్స్‌ కార్యాలయం వద్ద సోమవారం ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లాలో దాళ్వా పంటను రైతులు అమ్మి రెండు నెలలు గడుస్తోందని, పెండింగ్‌లో ఉన్న సొమ్మును త్వరగా జమ చేయాలని కోరారు. జిల్లాలో పంటలు పండించేది ఎక్కువగా కౌలు రైతులు, పేద రైతులు మాత్రమేనని, వీరంతా పంట పెట్టుబడికోసం రూ.లక్షలను ప్రైవేటు వ్యక్తులు నుంచి అప్పులు తెచ్చారన్నారు. ఇటువంటి తరుణంలో సార్వా సాగుకు సన్నద్ధం కావడానికి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం ధాన్యం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కవురు శ్రీనివాస్‌, పిల్లి కామేశ్వరరావు, నెక్కంటి శ్రీనివాసు, చేబ్రోలు బాలాజీ, కొండేటి నర్సింహరావు, కొండేటి సత్యనారాయణ, నందమూరి రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాంక్‌ ఎదుట భవన యజమాని నిరసన


కాళ్లలో బ్యాంక్‌ బరోడా శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దుర్గాంబ, కుటుంబ సభ్యులు

కాళ్ల: బ్యాంక్‌ కోసం అద్దెకు తీసుకుని, సమయం ముగిసినా తమ భవనాన్ని ఖాళీ చేయకపోవడంపై ఇంటి యజమానురాలు బండారు దుర్గాంబ ఆందోళనకు దిగారు. కాళ్లలో బండారు దుర్గాంబకు చెందిన భవనాన్ని అద్దెకు తీసుకుని బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా గ్రామ శాఖ నిర్వహిస్తున్నారు. అగ్రిమెంట్‌ సమయం ముగిసినా బ్యాంక్‌ ఉద్యోగుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఇంటి యజమానురాలు బండారు దుర్గాంబ (దివ్యాంగురాలు) కుటుంబ సభ్యులతో కలిసి బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా బ్యాంక్‌ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014వ సంవత్సరంలో ఇల్లు నిర్మిస్తున్న సమయంలో బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా కాళ్ల బ్రాంచి కార్యకలాపాల నిమిత్తం అద్దె భవనం కావాలని కోరడంతో గ్రౌండ్‌ ఫ్లోర్‌ అద్దెకు ఇచ్చామన్నారు. 2014 నుంచి 2024 వరకు 10 ఏళ్ల కాలానికి అద్దె అగ్రిమెంట్‌ చేశారన్నారు. అద్దె గడువు మార్చి నెలాఖారుతో ముగిసిందన్నారు. తాను వికలాంగురాలిని కావడంతో పైఅంతస్తు నుంచి కిందకు, పైకి ఎక్కేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నానన్నారు. 2023 నుంచి బ్యాంకును నిర్వహించే భవనాన్ని ఖాళీ చేసి అప్పగించాలని బ్యాంక్‌ మేనేజర్‌కు అనేకసార్లు విన్నవించినా సరైన సమాధానం రాలేదన్నారు. ఇప్పటికైనా బ్యాంక్‌ ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకును ఖాళీ చేసి భవనాన్ని అప్పగించాలని కోరారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఉండి: ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో అవమానంగా భావించి ఓ మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. పాములపర్రు శివారు వెంకట్రాజపురం (కొండగూడెం) ప్రాంతానికి చెందిన రాయగడ పద్మనాభ రమేష్‌నాయుడు ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రంలో పనిచేస్తుండగా భార్య నాగమల్లేశ్వరీ ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నెల 6న రాత్రి 10 గంటల సమయంలో నాయుడు సమీప బంధువు దువ్వాని మోహన్‌ ఎక్కడ ఉన్నాడంటూ దువ్వాని విజయ్‌బాబు, మానేపల్లి రాజబాబు, దువ్వాని మంగాదేవి అనే వారు నాగమల్లేశ్వరి ఇంటికి వచ్చి గొడవ చేశారు. అతని గురించి నన్నెందుకు అడుగుతున్నారంటూ ఆమె నిలదీయడంతో వీరు దాడి చేశారు. అప్పటికే అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండగా, తనపై దాడి చేయడంతో అవమానాన్ని భరించలేక నాగమల్లేశ్వరి ఈ నెల 10న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్సై ఎ.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్‌ బోధనతోనే సత్ఫలితాలు



భీమవరం భారతీయ విద్యాభవన్స్‌లో మాట్లాడుతున్న మాజీ శ్రీరంగనాథరాజు

భీమవరం: విద్యావిధానంలో సెంట్రల్‌ సిలబస్‌లో జరిగే మార్పులకు అనుణంగా ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా అవగాహన పెంచుకుని బోధన చేస్తేనే విద్యార్థులు ఉన్నతులుగా తయారవుతారని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సెంట్రల్‌ సిలబస్‌లో జరిగే మార్పులపై భీమవరంలోని భారతీయ విద్యా భవన్స్‌ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణా తరగతుల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. సెంట్రల్‌ సిలబస్‌ డిప్యూటీ కమిషనర్‌ డీటీ సుదర్శన్‌ మాట్లాడుతూ ప్రస్తుతం మార్పు చెందుతున్న టెక్నాలజీని ఉపాధ్యాయులు ఉపయోగించి డిజిటల్‌ టీవీ, డిజిటల్‌ బోర్డుల ద్వారా పాఠాలు బోధిస్తే విద్యార్థులు కుతూహలంగా వింటారని, దీంతో వారికి బోధన అర్థమై విద్యాపరంగా అభివృద్ధి చెందుతారన్నారు. సెంట్రల్‌ సిలబస్‌ సీనియర్‌ రిసోర్స్‌ పర్సన్‌ నిట్టల పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థులకు ఆల్‌రౌండ్‌ డవలప్‌మెంట్‌ రావాలంటే రోజంతా చదివిస్తే చదువు రాకపోగా సైకాలజీ సమస్యతో చదువుపై విరక్తి చెందే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, ఆర్ట్‌, మ్యూజిక్‌, డాన్స్‌, కథలు, మానవత్వ విలువలు నేర్పుతూ విద్యార్థుల మనోవికాసానికి పాటుపడాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, గుంటూరు, భీమవరం భవన్స్‌ నుంచి సుమారు 475 మంది స్కూల్స్‌ టీచర్స్‌ హాజరయ్యారని ప్రిన్సిపాల్‌ ఎల్‌వీ రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల భవన్స్‌ స్కూల్స్‌ సెక్రటరీ యూకే విశ్వనాథ రాజు, రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ సామంతపూడి శ్రీరామరాజు, కోశాధికారి కొత్త శ్రీనివాస్‌, స్కూల్‌ సంచాలకుడు బీవీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని చిరు వ్యాపారి దుర్మరణం

పెనుగొండ: దొంగరావిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కత్తిపీటల వ్యాపారి మృతి చెందాడు. పెనుగొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన వీరవల్లి వెంకటపతి (75) కత్తి పీటల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వ్యాపారం నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళుతూ దొంగరావిపాలెం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా పెరవలి నుంచి రావులపాలెం వెళుతున్న కారు వేగంగా ఇతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటాపతి తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే హైవే అంబులెన్స్‌లో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలోనే ప్రాణాలు విడిచాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెనుగొండ ఎస్సై షేక్‌ సుభాని చెప్పారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నీట్‌ నిర్వహణపై సమగ్ర విచారణ జరపాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్‌ కళాశాలల్లో ప్రవేశాల కోసం నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్‌ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకి నాని, ఎస్‌.మహర్షి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. నేషనల్‌ ఎలిజిబిలిటీ కమ్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ను దేశ వ్యాప్తంగా వైద్యవిద్యా కోర్సులు చదవాలనుకునే 24 లక్షల మంది విద్యార్థులు మే 5న ప్రవేశ పరీక్ష రాశారని, నీట్‌ యూజీ–2024 పరీక్ష నిర్వహణ సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫలితాలలో 67 మందికి ఫస్ట్‌ ర్యాంక్‌ రావడమే కాక వీరిలో ఎనిమిది మంది ఒకే కేంద్రంలో పరీక్ష రాశారన్నారు. జూన్‌ 14న ఫలితాలు విడుదల చేయాల్సి ఉండగా హఠాత్తుగా పది రోజులు ముందు జూన్‌ 4నే ఫలితాలు విడుదల చేయడాన్ని ప్రశ్నించారు. అక్రమాలు కప్పి పెట్టే ఉద్దేశంతో ఇలా చేసిందని విమర్శించారు. పేపర్‌ లీక్‌పై ఎన్‌టీఏ డైరెక్టర్‌ జనరల్‌ సుబోద్‌ కుమార్‌ ప్రకటన చాలా హాస్యాస్పందంగా ఉందని, 4,750 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు సజావుగా నిర్వహించామని, కేవలం 6 కేంద్రాల్లో మాత్రమే సమస్య వచ్చిందని చెప్పడం చాలా దుర్మార్గమన్నారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. తక్షణమే మరోసారి నీట్‌ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్‌): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను నూతన ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్‌(సీఐటీయూ) జిల్లా విస్తృత స్థాయి సమావేశం సంఘం నాయకులు అనురాధ అధ్యక్షతన సోమవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగింది. రమాదేవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కారం చేసే దిశగా ఆలోచన చేయాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం, ఇన్సూరెన్స్‌, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్‌ పెంచాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఫస్ట్‌ ఎయిడ్‌ కిట్లు అందించాలన్నారు. జిల్లలోని సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్‌.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌, యూనియన్‌ నాయకులు అనంత లక్ష్మి, వెంకటలక్ష్మి, వెంకట పద్మ, అంజలీదేవి పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఒంటికి వ్యాయామం మంచిదేగా..

- బరువు తగ్గించుకునే క్రమంలో జిమ్‌ల ప్రాధాన్యత అధికం
- తణుకులో అధునాతన వసతులతో జిమ్‌లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు

తణుకు అర్బన్: వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చుతున్నారు. వివిధ పద్ధతుల్లో వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమన్న పెద్దల మాట అక్షరాలా ఆచరణలోకి వచ్చినట్లు కనిపిస్తోంది. ఎంత డబ్బు సంపాదించినా ఆరోగ్య సమస్యలు తలెత్తితే చేసేదేమీలేదని అంతా బాగున్నప్పుడే ఆరోగ్యాన్ని కాపాడుకునే కార్యాచరణ చేయాలనే తపన యువతీ యువకులతో పాటు మహిళలు, పురుషుల్లో కూడా మొదలైంది. ముఖ్యంగా రెండు సంవత్సరాలపాటు మానవాళిని కుదిపేసి ప్రపంచవ్యాప్తంగా మరణమృదంగం వాయించిన కోవిడ్ ద్వారా ప్రజలు ఎంతో గుణపాఠం నేర్చుకున్నారు. శారీరక శ్రమ అధికంగా చేసిన వారిని కోవిడ్ ఇబ్బంది పెట్టలేకపోయిందని వారంతా కోవిడ్ బారిన పడలేదంటూ వైద్యులు బహిరంగంగానే చెప్పారు. ఆ గుణపాఠంతో నేటి రోజుల్లో యువతతో పాటు నడి వయస్సు వారు కూడా స్త్రీలు, పురుషులు సైతం వ్యాయామం కోసం జిమ్‌ల బాట పడుతున్నారు. ఇంటివద్ద ఉండి చిన్నపాటి వ్యాయామాలు చేసే కంటే జిమ్‌లలో అయితే ట్రైనర్స్ ఒక క్రమ పద్ధతిలో వ్యాయామ ప్రక్రియ చేయిస్తారనే నమ్మకం ప్రజల్లోను కలిగింది. గతంలో జిమ్ అంటే కేవలం శరీర సౌష్టవానికి, శరీర ఆకృతిని అందంగా తీర్చిదిద్దుకునేందుకు మాత్రమే ఉపయోగపడే పరిస్థితి ఉండగా నేడు మంచి వ్యాయామం మంచి ఆరోగ్యానికి నాంది అనే ఉద్దేశ్యంతో జిమ్‌ల బాట పడుతున్నారు. దీంతో పట్టణాల్లో నడుస్తున్న జిమ్‌లు ఉదయం, సాయంత్రం వేళల్లో కిక్కిరిసి ఉంటున్నాయి.

అధునాతన పరికరాలు

నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అధునాతన పరికరాలతో ఉన్న జిమ్‌లు ఇప్పుడు తణుకు పట్టణంలో కూడా అందుబాటులోకి వచ్చాయి. అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చిన పరికరాలు మానవ శరీరంలోని వివిధ అవయవాలను ప్రేరేపితం చేసే విధంగా రూపుదిద్దుకున్నాయి. ముఖ్యంగా గుండె పనితీరు మెరుగు చేసే ప్రక్రియ ఉన్న వ్యాయామ పరికరాలు సైతం నేటి జిమ్‌లలో అందుబాటులోకి వచ్చాయి. ఏ భాగంలో అయినా పేరుకుపోయిన కొవ్వు పదార్థాలు కరిగిపోవాలన్నా కూడా దానికి అనుగుణంగా ఒక పరికరం రూపుదిద్దుకుందంటే వ్యాయామ శాల ఏవిధంగా అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే లేనటువంటి అత్యాధునిక వ్యాయామ పరికరాలు తణుకులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎఫ్‌బీ ఫిట్‌నెస్ జిమ్‌లో అందుబాటులో ఉన్నాయి. తణుకులో మొత్తం 6 జిమ్‌లు ఉండగా వేలాది మంది తమ విలువైన సమయాన్ని జిమ్‌లకు కేటాయిస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉండే వ్యాయామ పరికరాలతో పోటీపడే పరికరాలు తణుకులో అందుబాటులోకి వచ్చాయి. దీంతో తణుకుతో పాటు పరిసర గ్రామాల వాసులు సైతం తణుకు వచ్చి గంటల సమయం జిమ్‌లకు కేటాయిస్తూ తమ శరీర సౌష్టవాన్ని పెంపొందించుకుంటున్నారు.

జిమ్ బాటపడుతున్న యువతి, మహిళలు

అందమైన శరీర సౌష్టవంతోపాటు బరువు తగ్గాలనే ఉద్దేశ్యంతో సైతం నేడు యువతులు, మహిళలు అధిక శాతం జిమ్‌లకు తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఏదోక సమయం జిమ్‌కు వస్తూ అందుబాటులో ఉన్న పరికరాలతో కసరత్తులు చేస్తున్నారు. శరీరం ధృడంగా ఉంటే మానసికంగా కూడా బలంగా ఉండవచ్చనే నమ్మకం కలగడంతో తణుకులో ఉన్న జిమ్‌లు కిటకిటలాడుతున్నాయి. అంతేకాకుండా నేడు అందుబాటులో ఉన్న అధునాతన పరికరాల సాయంతో శరీరంలో ఏ భాగంలో కొవ్వు కరగాలన్నా, కొన్ని భాగాలు మెలికలు తిరిగిన కండలు, నాజూగ్గా తయారయ్యే వెసులుబాటు ఇప్పుడు ఏర్పడింది.



తణుకులో అధునాతన పరికరాలు కలిగి ఉన్న ఎఫ్‌బీ జిమ్



తణుకులో కార్డియాలజీకి సంబంధించిన వ్యాయామాలు చేసే పరికరాలు



తణుకులో 25 రకాల వ్యాయామాలు చేసే వసతులున్న పరికరం



తణుకులో జిమ్‌లో అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలు

వ్యాయామం వలన కలిగే ఉపయోగాలు

- వ్యాధి నిరోధక శక్తి మెరుగవుతుంది.
- చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది.
- రోజూ వ్యాయామం చేయడం వలన శరీరం ధృడంగా తయారవుతుంది.
- కండరాలకు చక్కటి ఆక్సిజన్ సరఫరా చేయడంతో గుండె, ఊపిరితిత్తుల పనితీరు బాగుంటుంది.

ఆరోగ్యంగా ఉండేందుకు



వ్యాయామం అంటే గతంలో కేవలం కండలు పెంచుకోవడమే అనేటట్లు ఉండేది. కానీ నేడు మంచి ఆరోగ్యం కోసం, బరువు తగ్గడం కోసం కూడా అధికశాతం ప్రజానీకం జిమ్‌లకు వస్తున్నారు. ముఖ్యంగా యువత మంచి శరీర పౌష్టవం కోసం వ్యాయామాలు చేస్తుండగా, నడి వయస్సువారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వివిధ వ్యాయామాలు చేస్తున్నారు. గతంకంటే కూడా ప్రజల్లో ఆరోగ్య నియమాలపై అవగాహన పెరిగింది. ముఖ్యంగా యువతీయువకులే కాకుండా మహిళలు సైతం జిమ్‌లలో వ్యాయామం చేస్తున్నారు.

– షేక్ ఫిరోజ్,
ఎఫ్‌బీ ఫిట్‌నెస్ జిమ్ యజమాని, తణుకు

అనారోగ్య సమస్యలు ఉండవు



ఏడాదికాలంగా జిమ్‌కు వచ్చి ట్రైనర్ చెప్పిన ప్రకారం వివిధ వ్యాయామాలు చేస్తున్నాను. రోజూ వ్యాయామం చేయడం వలన మానసికంగా చాలా ఉల్లాసంగా ఉంటుంది. మన రోజువారీ దినచర్యలో ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని చేయడం చాలా మంచిది. వ్యాయామం చేయడం వలన కొన్ని రకాల అనారోగ్య సమస్యలు మన దరికి చేరవు. ముఖ్యంగా పెద్ద వాళ్లలో బీపీ, సుగర్ లెవెల్స్‌తోపాటు కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులు సైతం ఎక్కువ తక్కువలు కాకుండా ఉంటాయి.

– గొర్రెల సత్యశ్రీ, తణుకు

- నిత్యం వ్యాయామం చేయడం వలన కండరాలు బలోపేతం అవుతాయి.
- నిత్య వ్యాయామం ద్వారా గుండెకు రక్తప్రసరణ పంపింగ్ విధానం మెరుగుపడుతుంది.
- బీపీ, సుగర్‌లు నిలకడగా ఉంటాయి.
- శారీరక ధృడత్వంతోపాటు మానసికంగాను ధృడంగా తయారవుతారు.
- మంచి క్రమశిక్షణతోపాటు ప్రతి పనిపైనా ఏకాగ్రత సిద్ధిస్తుంది.
- కొన్నిరకాల వ్యాయామాలు మీ బరువును సైతం తగ్గిస్తుంది.
- మంచి నిద్ర అందిస్తుంది.

క్లుప్తంగా

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాంబాబు

అత్తిలి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని అత్తిలి ఎస్‌ఐ వి రాంబాబు చెప్పారు. సోమవారం అత్తిలిలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ఎస్‌ఐ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు పర్యావరణంపై అవగాహన కలిగిఉండాలని, భూతాపాన్ని తగ్గించడానికి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు పాల్గొన్నారు.

దండగర్ర జెడ్పీహెచ్ఎస్ పీడీకి ప్రశంసా పత్రం అందజేత



ప్రశంసా పత్రం అందుకుంటున్న పీడీ చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కే.పద్మరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ విషయాన్ని సోమవారం స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న యోగాసన పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించేందుకు ఈ ప్రశంసా పత్రం లభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బడుగు చంద్రశేఖర్‌ను ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల విద్యాకమిటి సభ్యులు అభినందించారు.

వాటర్ ట్యాంకర్ బహూకరణ



దువ్వ గ్రామ పంచాయతీకి వాటర్ ట్యాంకర్‌ను అందజేస్తున్న దాత సత్యనారాయణ

తణుకు టౌన్: మండలం దువ్వ గ్రామ పంచాయతీకి చెందిన దాతలు వాటర్ ట్యాంకర్‌ను బహూకరించారు. సోమవారం దువ్వ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులకు అవసరమైన రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ట్యాంకర్‌ను గ్రామానికి చెందిన అడ్డాల సత్యనారాయణ తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి రూ. 2. 50 లక్షలు విలువైన వాటర్ ట్యాంకర్‌ను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజ, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీలు పీ అశోక్, పంచాయితీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కుమార్‌కు శుభాకాంక్షలు



బండి సంజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఈతకోట తాతాజీ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర మంత్రిగా ఢిల్లీలో ప్రమాణ స్వీకరం చేసిన బండి సంజయ్ కుమార్‌కు వారి ఇంటి వద్ద సోమవారం బీజేపీ నాయకులు తాడేపల్లిగూడెంనకు చెందిన ఈతకోట తాతాజీ, నరిశే సోమేశ్వరరావులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రామోజీరావుకు ఘనంగా నివాళులు



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అచ్యుతరామయ్య

తణుకు: సాధారణ రైతు కుంటుంబం నుంచి వచ్చి, స్వయంకృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు లేని లోటు తీర్చలేదని తణుకు ఆంధ్రాసుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య అన్నారు. శనివారం తణుకు ఆంధ్రాసుగర్స్ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. ఆయనతోపాటు హెచ్‌ఆర్ ఎ.సాంబశివరావు, ఎల్‌డబ్ల్యూవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ట్రైనర్‌గా పచ్చిపులుసు శారదా రాణి



ఇంపాక్ట్ ట్రైనర్ సర్టిఫికెట్‌ను తీసుకుంటున్న పచ్చిపులుసు శారదా రాణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంపాక్ట్ ట్రైనర్‌గా తాడేపల్లిగూడెం ఆర్యవైశ్య మహిళ పచ్చిపులుసు శారదా రాణి ట్రైనింగ్ పొందారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు పర్యవేక్షణలో ట్రైన్ ది ట్రైనర్ వర్క్ షాపు 154 బ్యాచ్ 30 రోజుల ట్రైనింగ్ ఇటీవల సికింద్రాబాద్‌లో నిర్వహించారు. శిక్షణ అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు కేవీ ప్రదీప్ తదితరుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం శారదా రాణి అందుకున్నారు. అనంతరం ఇటీవల ఐసీఐ తాడేపల్లిగూడెం టైగర్స్ క్లబ్‌ను స్థాపించి, క్లబ్ ద్వారా అనేక సేవలు అందజేస్తున్నారు. ట్రైనర్ పుచ్చిపులుసు శారదా రాణి సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోను, కళాశాలలోని విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చదువుల్లో ముందుండేలా, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తామన్నారు.

సనాతన ధర్మంతోనే సమానత్వం



ఇంటింటికీ ధర్మ ప్రచారం కర పత్రాలను పంపిణీ చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: సనాతన ధర్మాన్ని ఆచరించడం ద్వారా మానవ జీవితంలో అసమానతలను తొలగించి, సమానత్వం సాధించవొచ్చని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ మన్నే కుమారస్వామి అన్నారు. సనాతన ధర్మం గొప్పదనాన్ని ప్రజలకు వివరించడానికి ఇంటింటికీ ధర్మ ప్రచారం కార్యక్రమం సోమవారం యలమంచిలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ సనాతన ధర్మంలో ఉన్న కులాల ఆవిర్భావం , వాటి విశిష్టత, కులవృత్తుల గురించి అవగాహన కల్పించడమే ఈ ధర్మ ప్రచార ప్రధాన ధ్యేయమన్నారు. వృత్తుల ఆధారంగా కులాలను ఏర్పరచారే కానీ మానవులంతా సమానమేనని సనాతన ధర్మం చెబుతోందన్నారు. దానిని వక్రీకరించి నేడు మానవులు కులాలుగా విడిపోయి తగాదాలు పడుతున్నారన్నారు. సమాజంలో మనుషులు కలిసి జీవించాలంటే సనాతన ధర్మాన్ని ఆచరించడమే ఉత్తమ మార్గమన్నారు. గ్రామ ధార్మిక సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని హిందువులు విజయవంతం చేయాలని కుమారస్వామి కోరారు.

రేపు కేజీఆర్ఎల్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

భీమవరం: పట్టణంలోని కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో ఈ నెల 12న దివీస్ ఫార్మా ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ కె.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, హైద్రాబాద్ సమీపంలో ఉన్న బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ విభాగంలో పని చేయడానికి క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌లో బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందిన విద్యార్థులు అర్హులన్నారు. క్యాంపస్ డ్రైవ్‌లో కేవలం పురుషులకు మాత్రమే అవకాశముందని నాగేశ్వరరావు పేర్కొన్నారు.

మావోయిస్టుల చేతిలో బలైన జవాన్‌కు నివాళి



తణుకులో జవాను సాంబశివరావుకు నివాళులర్పిస్తున్న సీఐఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది

తణుకు: 1998లో మావోయిస్టులు అమర్చిన ల్యాండ్ మైన్ పేలిన ఘటనలో మృతి చెందిన తణుకు పట్టణానికి చెందిన జవాను పడాల సాంబశివరావు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక 27వ వార్డు సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాంబశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసిన సీఐఎస్ఎఫ్, తణుకు పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొని ఘనంగా నివాళ్లులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి భార్య లక్ష్మిని ఘనంగా సత్కరించారు.

చిన్నారికి అభినందనలు



తణుకులో చిన్నారి కార్తికేయను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: తణుకు పట్టణానికి చెందిన చిన్నారి లాస్యతేజ్ కార్తికేయ ఇటీవల నేపాల్ దేశంలో జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం తణుకులోని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నివాసానికి విచ్చేసిన చిన్నారి లాస్యతేజ్ కార్తికేయ, తండ్రి పసుపులేటి భాస్కర్‌లను ఎమ్మెల్యే రాధాకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.

దగ్గులూరులో ప్రత్యేక వైద్య శిబిరం



దగ్గులూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డా.అడ్డాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. దగ్గులూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డా.ప్రతాప్ కుమార్ రోగులను పరీక్షించి సలహాలు, సూచనలు అందించారు. శిబిరంలో పరీక్షలు చేయించుకోవడం వలన తక్షణమే వైద్య సేవలు అందించొచ్చని సూచించారు. గర్భిణీలు, బాలింతలను పరీక్షించారు. కిశోర బాలికలను పరీక్షించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత వల్ల పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. శిబిరంలో షుగర్, బీపీ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో 150 మందిని పరీక్షించారు. హెచ్‌వీ పీ.ఎలిజబెత్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీ యన్నపు లిఖిప్రియ, ఏఎన్ఎం ఎం.మార్తమ్మ, ఎంపీహెచ్‌ఏ ఎం.దివాకర్‌బాబు, ఆశ వర్కర్లు కే.మంగమ్మ, కే.పుష్పకుమారి, తదితరులు పాల్గొని వైద్య సేవలందించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో విక్టర్

పెనుగొండ: పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా సోమవారం సిద్ధాంతంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. గ్రామాలలో ఎక్కడ చెత్త లేకుండా డంపింగ్ కేంద్రాలకు తరలించాలని, మురుగు సమస్య ఉండకూడదని అధికారులకు సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో ప్రజలు పంచాయతీ అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమం సోమవారం నుంచి ఐదు రోజులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వీఎస్ఎస్. శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్. శ్రీనివాస్ దొర, ఈవోపీఆర్‌డీ సీహెచ్‌వీ. రెడ్డి, గ్రామ కార్యదర్శి నరసింహమూర్తి సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడు తూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కోసం డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ జువాలజీ, బిఎస్సీ ఎంపీసీఎస్, బీ కామ్ కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పై కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే తీసుకుంటారని తెలిపారు. అర్హులైన విద్యార్థినులకు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు అందిస్తారని తెలిపారు. కళాశాలలో రక్షిత మంచినీరు, అధునాతన వాష్ రూమ్స్, డిజిటల్ విద్యా బోధన, డిజిటల్ లైబ్రరీ, సెమినార్ హాల్, లేబరేటరీ, గ్రీన్‌హౌస్ వంటి వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిగ్రీ అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థినులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్, ఇంటర్మీడియట్ మార్కుల లిస్టు, టీసీ మరియు పదో తరగతి మార్కుల లిస్టు ఒరిజినల్, పోటోస్టాట్ కాపీలను తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 6302194657, 7406547372 లలో సంప్రదించాలన్నారు.

ఈ తప్పు భావితరాలకు పెనుముప్పే



గూడెంలో ఒక ప్రాంతంలో అన్ని వస్తువులను ప్లాస్టిక్ బ్యాగులతో తీసుకెళుతున్న ప్రయాణికులు



పెంటపాడు డంపింగ్ యార్డులో చెత్తను వంతెనపైనే వేసిన దృశ్యం

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం
- రేపటి పౌరుల మనుగడపై తీవ్ర ప్రభావం

పెంటపాడు: ఉదయం లేచింది మొదలు టిఫిన్లు, కూరగాయలు,కిరాణా సామాగ్రి ఇలా ప్రతి వస్తువునూ ప్లాస్టిక్ కవర్లతో తీసుకువస్తున్నాం. ఆకరికి హోటల్ నుంచి టీ తెచ్చుకునేందుకు సైతం పాలథీన్ కవర్లనే వినియోగిస్తున్నాం. అందుకే ఏ ఇంటిలో చూసినా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నా యి. వాటిని నిర్లక్ష్యంగా ఆరుబయట పడేస్తుండడంతో రోడ్లు,వీధులు కాక డ్రెయి నేజీల్లోనూ చెత్తతోపాటు పాలిథీన్ కవర్లు దర్శనమిస్తున్నాయి. పంట కాలువలు సైతం ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా ప్రజల ఆలోచనలో మార్పు రావడం లేదు.

నిబంధనలు బేఖాతర్

పర్యావరణ పరిరక్షణ చట్టం కింద 2021 ప్రకారం 20 మైక్రాన్ల తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వాస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితోనే నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక రకాల అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ప్లాస్టిక్ సంచులను తయారు చేయాలని ప్రతి వస్తువుపై తయారీ సంస్థ పేరు,రిజిస్ట్రేషన్ సంఖ్య, మందం వంటి వివరాలు విధిగా ముద్రించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిబంధనలు పాటించని కంపెనీలకు,వాటిని విక్రయించే వ్యాపారులకు జరిమానా విధించాలని నిబంధనలు ఉన్నాయి. అయినా ఆచరణలో ఇవి అమలు కావడం లేదు.

ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

గూడెం నియోజకవర్గంలో పట్టణం, పెంటపాడు, రూరల్ మండలాల్లో సుమారు 1000కి పైగా వివిధ దుకాణాలు ఉన్నట్లు ఒక అంచనా. ప్రతి షాపు లోనూ పాలథీన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలిసిపోవాలంటే వందల ఏళ్ల కాలం పడుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి ప్రత్యామ్నాయంగా జనప నార, కాగితం కవర్లు వాడాలని ప్రభుత్వం సూచిస్తోంది. అటువంటి వాటితో తయారు చేసిన ఉత్పత్తులకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తుంది. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలంటే ప్రజలు సామాజిక బాధ్యత తీసుకోవాలి.ప్లాస్టిక్ కవర్ల నిషేధంలో పాలుపంచుకోవాలి. ప్రజలు క్యారీ బ్యాగులుగా జనపనార, గుడ్డ సంచులతో తయారు చేసిన సంచులను వాడితే భవిష్యత్ తరాలకు మంచి చేసిన వారవుతారు.

ఆరోగ్యానికి హానికరం



ప్లాస్టిక్ అతిగా వినియోగం వల్ల పర్యావరణానికి, మానవాళి ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలుగుతుంది. ప్లాస్టిక్ నిషేధాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తే పర్యావరణ కాలుష్యాన్ని అధిగమించవచ్చు. దీనిపై ప్రజలు చైతన్య వంతులు కావాలి.

– డాక్టర్ పూజిత, ముదునూరు పీహెచ్‌సీ